# తుమ్మెద — పువ్వు

శ్రీ బాలకృష్ణగారు

గిరిజను భర్త వదలిపెట్టి సుమారు ఆరునెలలు కావస్తోంది. మొదటిభార్య వుండగానే ఆమెను పెళ్లి చేసుకున్నాడు మూర్తి. ఆనాడు తండ్రి చెప్పాడు "అమ్మా ఆలోచించుకో" అని ... మోహము కళ్లు కప్పేసింది. న్యాయాన్యాయ విచారణవుండదు. నిజానికి లోకం అందం అనుకునే దాని విషయంలో ఆమె కాలిగోటికి పోలదు గిరిజ. గిరిజ అప్పుడప్పుడా విషయాన్ని అనుకున్నా తనలో విశిష్టత ఏదో వుండబట్టే తనను జేరాడనుకునేది. ఆవిశిష్టత ఏదో ఆలోచించిన క్షణంలేదు ... మొదట మూర్తి యింటికి ఒక friend లా వెళ్తుండేది... ఆమె గౌరవం! ఆమె మర్యాద!... అమాయకురాలు యింటికి అతిథిగావచ్చి చిచ్చుపెట్టుందని కానలేకపోయింది. గిరిజ పెద్ద సంసారంలో పుట్టిన పిల్లే. ఆరోజున అతను చెప్పిన మాటల్లోని మాధుర్యం తానొకజీవికి పరోక్షంగా అన్యాయం చేస్తున్న విషయాన్ని విస్మరింపజేసింది. మానవ స్వభావం! యౌవన జీవితంలోని మత్తువచ్చే వృద్ధాప్యాన్ని తలుచుకోదు. తన సుఖానికి అంతరాయం కలుగనంతవరకు యితరుల సుఖం ఆలోచించాలి ... తరువాత ?... ఎప్పుడు యితరుల సుఖాల పొలిమేర తన సుఖాల హద్దును చొచ్చుక వస్తుందో ఆనాడు తన హద్దును పెంచుకుందుకు యితరులకు కష్టంవచ్చినా వెనుదీయదు. ఇది ఆమె సిద్ధాంతం. ఆమె నమ్మింది. ఆచరిస్తుంది... ఆమెవచ్చి నాకొంప కూలతోయవద్దని అడిగినప్పుడు గిరిజ తను నమ్మిన సిద్ధాంతాన్ని ఏకరువు పెట్టింది... ఆనాడు తన తల నిమురుతూ "గిరిజా నీవు నాప్రాణానివి, నీవు లేకపోతే నాప్రాణంలేనట్టే ... నన్ను దయజూడవు" అని ప్రాధేయపడ్డపుడు. నమ్మక ఏమిచేస్తుంది? "నన్ను పెళ్లిచేసుకుని నాప్రాణం నిలబెట్టవూ" అని జాలిగా తనవైపు చూచినప్పుడు అతడు అటువంటివాడు యీ విధంగా మారతాడని ఎల్లా అనుకుంటుంది? అప్పుడు "అప్సరసల సౌందర్యాన్ని తలదన్నే సౌందర్యం నీది గిరిజా" అని తన కళ్లల్లోకి, హృదయంలోకి ఏదో కాంక్షతో చూచే మూర్తేనా యిన్నాళ్లయినా తన ముఖం చూడనిది? ఏదో తీవ్ర వాంఛకు గురియై... పువ్వు పువ్వుకూ ఎగురుతూ పోయే మధుపంలా తిరుగుతూ వుంటాడు. జంతువాంఛకే గురియై తిరిగేవాడని ఆమెకేం తెలుసు? మధుపం ఒక పువ్వునుండి ఓ పువ్వుకెగిరేప్పుడా పువ్వును నలిపిపోదు. తన వాంఛకోసం అమాయకజీవుల్ని బలిచేసే ప్రకృతి! ... ఏ ప్రకృతో! ఇటువంటి రాక్షస ప్రకృతితో మనుజులుంటారని ఆమెకేం తెలుసు? చూచాయగా మూర్తిని గురించి తెలిసిన విషయాలు నిజమౌతాయేమో! ... నళినిగా చెలామణీ అయేతార ఏన సంతా! ఒకప్పుడు తన కాళ్లవద్దకు పతిభిక్షకోసం వచ్చి విసిరికొట్టబడ్డ యువతా! ఏనాటికానాడు కొత్తరుచులకై ఆసింగి, తన రుచులకై యితరులను బలిచేసే ప్రకృతిగల మానిసి మరల ఆమెను జేరటంలో ఆశ్చర్యం ఏముంది. ఈనాడు గిరిజవెళ్లి ఆమెతోబాటు పతివద్ద స్థానం, ఆమె అధికారంలో సగం అడిగితే యివ్వగల వుదారత ఆమెవద్దవుందా? ఒకనాడు తననుంచి యిదేకోరింది తన భర్తను పెళ్లి చేసుకోవద్దని... ఆమె గిరిజకి స్థానంయిస్తే యివ్వొచ్చు ...యివ్వకపోవచ్చు... మొత్తానికి మూర్తి రెండవ భార్యను వదలిపెట్టాడు.

## శీలము

ఆమె అన్ని విషయాల్లోనూ పదునారణాల భారతనారి అయినా ఆవిషయంలో మాత్రం కాదనే చెప్పాలి. భారతనారి శీలానికి యిచ్చే ప్రాముఖ్యత ఆమె అనవసర మంటుంది. ఒకపురుషుడు వాంఛతో తన బుగ్గమీద ముద్దు పెట్టుకుంటే తనకేమి పోయిందని వాదిస్తుంది. తన్ను తన తల్లి ముద్దుపెట్టుకోదూ, అల్లాగే పెట్టుకుంటాడు, అందులో పోయిందేముందీ ... పోనీ అల్లాగ తల్లిలా పవిత్రభావంతో కాక ఏదో తీవ్రవాంఛతో ముద్దుపెట్టుకుంటే మాత్రం బుగ్గ కొరుక్కుపోలేదుకద! అందులోవున్న అందాన్ని లాక్కుపోలేదుకద! ఈవిధంగా వాదించటం ఆమెకు పరిపాటయిపోయింది. ఆవాదనకు తాళం వేసేవాడెవడున్నా ఆమె దృష్టిలో ఉత్తమ సంస్కారి. అతను ఆమెకంటే రెండాకులెక్కువ చదివాడు. మొగవాడు ఆడదానిని చూచి

Sex విషయం ఎందుకు Feel అవాలీ? ఇద్దరు వ్యక్తుల మధ్య Sex తప్పితే యింకేమీ లేదూ? అతను అవసరమవుతే ఆడదానిముందు ఏపరిస్థితుల్లోనూ Sex ఫీలవనని చెప్పేందుక్కూడ సిద్ధమే!...ఆమె ఆడుది శీలాన్కి అంత ప్రాముఖ్యత ఎందుకివ్వాలి? మగవాడు ఎందుకివ్వక్కరలేదు? అంటుంది. ఇవ్వాలి ... అందరూ ఇవ్వాలి శీలాన్కి ప్రాముఖ్యత. మొగవాడికి కూడా శీలము ముఖ్యమే. నాగరీక ప్రపంచకములో మంచి శీలము కలవాణ్ణి గౌరవించినట్టు Loose charectered వాణ్ణి గౌరవించరు. కొందర్ని Loose charectered వాళ్లనీ గౌరవిస్తున్నారు అంటే వాళ్లలోని రాక్షస తత్త్వాలను గౌరవించటంలేదు. వాళ్లల్లో వుండే ఏదో ఒక గొప్ప గుణాన్ని మాత్రమే! ఎదురుగుండా వాడు మాంసం తింటుంటే అనాగరికుడు తనకు కావలికనుక వాడితో తలపడి లాక్కు తింటాడు; నాగరీకుడు నియమాన్కి తనంతతాను కట్టుపడి, తనది కాదనుకుని తలవంచుకుని వెళ్లిపోతాడు. తానుచేసుకున్న నియమాన్కి కట్టుపడడంలోనే వుంది నాగరికత. అచ్చోసిన ఆబోతులా తిరగటం నాగరీక లక్షణంకాదు. ఆమె మొదటే తప్పటడుగు వేసింది. పురుషునికి శీలము ప్రధానంకాదు అనుకోడంలో ఆమెది పునాదిలేనివాదం ...।ఏది ఏమవనీ ఆమె, ఆడుది మాత్రం శీలాన్కి ప్రాముఖ్యత ఎందుకివ్వాలి అంటుంది. ఆవాదాన్ని నమ్ముతుంది. అవసరం అవుతే ఆచరిస్తుంది. ఇప్పటి సంఘంలోని పరిస్థితులనుబట్టి పురుషునికన్న స్త్రీ శీలాన్కి ఎక్కువ ప్రాముఖ్యత యివ్వాలి అనేది నిర్వివాదాంశం.

ఆమె ఆరోజున కూర్చునివుంది మామిడితోపులో అతని ప్రక్కన. వెన్నెల మత్తు మత్తుగా మావిచిగుళ్లపైనుండి జారుతూ మీదపడుతోంది. కమ్మటిగాలి మెల్లగా వీస్తోంది. ఏదో అందని వాంఛలకోసం అర్రులు చాచే యౌవ్వన స్త్రీ హృదయం. ప్రక్కన వయస్సులోనున్న పిలిస్తే పలికే అందగాడు. హృదయం అంతా ఏదో తీయని బాధ అలముకుంది. శరీరంలోని ప్రతినాడీ ఏదో మధురానుభవంకోసం ఎదురు చూస్తోంది. ఆమెలో అహంభావం వెనుక దాగికొనివున్న పురుష వాంఛపైకి వచ్చింది అజ్ఞాతాన్నివీడి. ఆమెలోని ప్రతి అణువూ పురుష స్పర్శకోసం తహ తహ లాడజొచ్చింది. ఆమె పాలబుగ్గ క్రమంగా కెంపువర్ణానికి మారుతోంది. ఆమెకు తెలియదు ఆమెలో అంత పురుషవాంఛ పరిస్థితుల అనుకూలతకోసం వేచివుందని. ఆమె అతనివైపు చూచింది అదోలా-అతని బాహువుల్లో హాయిమని భావగీతాలు పాడింది ఆమె హృది. ఆమెలోని ఆరాటము ఎక్కడో మాయమయింది. ఆమెకు పరిస్థితుల నవగాహన చేసుకునే శక్తి మరలవచ్చింది. తాను ఒక క్షణ వాంఛకోసం తన శీలాన్ని బలిపెట్టింది. ఆమె అంతరాత్మ ఏదో చేయరానిపని చేశావు అని హెచ్చరిస్తూనే వుంది. ఆమె దృష్టిలో ఆమెశీలానికంత ప్రాముఖ్యత లేకపోవచ్చు... ఇదివరకామె సంస్కారాభిలాషగల యువతిగా గౌరవాన్నందేది. ఈనాడామె లోకదృష్టిలో ఒక నారి జారిపడ్డ పతిత మాత్రమే!...

(సశేషము)


## ఏజంట్లు కావలెను

కాకినాడ, నంద్యాల, నర్సాపురము, హైదరాబాదు, సికిందరాబాదు, బాపట్ల, చీరాల, ఒంగోలు, పొన్నూరు, గుంటూరు, తాడేపల్లిగూడెం, నూజవీడు, సామర్లకోట, పిఠాపురం, చిత్తూరు, నిడదవోలు, కొవ్వూరు, భీమవరం, రాజోలు, కడప, ప్రొద్దటూరు.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం, మద్రాసు-14.

# తుమ్మెద — పువ్వు

## శ్రీ బాలకృష్ణగారు

(గతసంచిక తరువాయి)

### ప్రేమ

ఆమెకు ప్రేమమాట తెలియకపోయినా ప్రపంచంలో అటువంటి పదార్థంమాత్రం వుందని తెల్సు ... తెలుసును ... తెలియదు ... మొత్తాన్కి ఆమెకు అతన్ని చూచినప్పుడు అదోతీయనిభావం, గౌరవభావం కలుగుతూండేది. దానికి ఆమె ప్రేమ అనే పేరుపెట్టుకోలేదు, ప్రేమఅంటే నిర్వచనం తెలియకేమో! ప్రేమపేర జరుగుతున్న మోసాల సెరిగుండియేమో! ఏది ఏమయినా అది ప్రేమఅయినా కాకపోయినా ఆమెలో ఆభావం అడపా తడపా పొడసూపుతూనేవుండేది. కొన్నాళ్లు ఆమెకు ఆవిషయం తెలియకుండా జరిగేది. కొన్నాళ్ళదోలా అనిపించేది. ప్రస్తుతావస్థ ప్రేమావస్థ కావచ్చు. ఆపేరు, ఆభావాన్కి పెట్టుకోదు; ఆమెకు భయం అపనంటే. ప్రేమ దైవాంశ సంభూతం. ఈపేరు కామాన్కి మారుగా, నాగరీక నామంగా స్వీకరించబడి వాడబడుతోంది. కాంగ్రెస్ స్వాతంత్ర్య సంపాదనకోసం, సత్యప్రచారంకోసం స్థాపింపబడ్డ సంస్థ, అది బ్లాకుమార్కెటీర్లు ధరించే బురఖాగా మారిపోయింది. నిక్కచ్చి కాంగ్రెస్‌వాది, ఆపేరు పీకేసుకుంటే గౌరవం దక్కుతుంది. ఆమె, అతని సాన్నిధ్యంలోనూ, పరోక్షంలోనూ కల్గేభావాలకు ప్రేమపేరు పెట్టుకుందుక్కి సాహసించలేదు. అతను దూరంనుంచివస్తే మంచినీళ్లడగబుద్ధి, Human కర్టిసీకోసంకాదు; పైపై Formality కోసంకాదు. ఏదో వింతమధుర భావప్రేరణవల్ల. అతను మాట్లాడుతూంటే చెవులప్పగించి వినబుద్ధి...ఏదో విపరీతశక్తి—ఆకర్షణశక్తి అతనివద్దకు లాగడంవల్ల. అతని దేహసౌందర్యం చూచినప్పుడు పొడసూపేది, అతని బాహువులమధ్య, అతని కౌగిలుల బిగువులోనూ వుండిపోదామనే భావంకాదు...అవ్యక్త భావాతీత అనందం. అతను, యీవాళకు వుండమని బతిమాలినా వుండడు.

అతని కంతతోస్తే అంత ఒక మెరపులావచ్చి ఆమె దృష్టిలోంచి మాయమయిపోతూంటాడు... ఆ మెరపుకాంతిని తలచుకొని రాత్రంతా గడుపమనాభావం! అతను రాగానే బాలభానునిచూచిన పద్మంలా విప్పారుతుంది ఆమెముఖం. వర్షాకాలంలో వచ్చి వర్షించిపోయే మేఘనిలావచ్చి ఆశాజ్యోతి ఆరిపోకుండా నూనెపోసి వెళ్తాడు. అతనితోపాటు ఎగురుతూవెళ్తుంది ఆమె మనసు. అతనువచ్చి ఆమెతో మాట్లాడినక్షణంవుండదు. మాట్లాడలేకకాదు ... మాట్లాడితే బాగుండుననే కోరికలేకకాదు ... ఒకటే ఒక కార్ణం ... ఆమెలో తాను వున్నట్టు తలచిన ప్రేమ బీజాన్కి దోహదం యివ్వడం అవుతుంది తాను మాట్లాడ్డం ... తను యింకా ఓనిశ్చయాన్కిరాలేదు, తాను చేసుకోకపోతే బాధపడుతుందనే బాధచేత దోహదం ఇవ్వడాన్కి యిష్టంలేక...అతనికి ఆమె అంటే యిష్టం. ఆ యిష్టాన్కి ప్రేమఅనీ పేరు తగిలించి ప్రేమకి యింకో అర్థాన్ని కల్పించేందుక్కి సాహసించకపోయినా, అతడు ఆమెఅంటే తనకదో విధమైన Fancy అనిమాత్రం ఒప్పుకుంటాడు. ఆమె అతని దృష్టిలో అతిలోకసౌందర్యవతి కాకపోయినా అందమయిందిమాత్రం అవును. అతనికీ యిష్టమే ఆమెను పెళ్ళాడ్డం. అతనికీ అనిపిస్తూంటుంది. అదోలా ఆమెను చూడకపోతే. అందుకే అప్పుడప్పుడు వెళ్లి చూస్తూంటాడు. అతను కనే స్వప్నాల్లో ఆమెరూపం, ఆమె మంచితనం సుస్పష్టంగా ఉండకపోతే, కాన్పించకపోతే స్ఫుటంచేసుకుందుకు వెళ్తాడు ... ఒకటి...అతని స్వప్నాల్లోని నాయిక యీమె కాదు... కాదనడానికి వీలులేదు ఈమెయే కొద్దితేడాల్తో...స్వప్నంలో నాయికకు ఐశ్వర్యం ఉంటుంది (ఈమెకులేదు) అంతేనా తేడా? అయితే ఢంకా బజాయించిచెప్పి చేసుకుందును అనుకుంటాడు. అతను Lectures కూడా ఇస్తాడు మరి కట్నాలు పుచ్చుకోడం అంత మంచిపనికాదని; (అతెందుకు మనకి?)...ఐశ్వర్యమందు ఆశలేదని తన ఆత్మని ఎంతమోసం చేసుకుందామనుకున్నా లోలోపల పీకుతూనేవుంది ఆశ. అంతతప్పా అతనిమీద తొయ్యడమెందుకనుకుంటే యింకొక విషయం చెప్పవలసిఉంటుంది. అతనికి వీణవాయించే యువతిని చేసుకోడం సర్దా—అది ఆమెకురాదు (వచ్చే

దారిలేదు) అంచేత చేసుకుందుక్కు మనస్కరించటం లేదు అని అతని అంతరాత్మకు సమాధానం చెప్పు కుందామనుకుంటాడు. పైవిషయాల వెనుకనున్నదీ అతన్ని ఆమెను చేసుకోనివ్వనిదీ ఒక్కటే విషయం అతని ఆశాలతలు ఆకాశాన్నంటి వున్నాయి. ఆమె యింకా తలయెత్తేచూస్తోంది కాని ఎదగలేదు ఏవిధంగానూ-ఆ ఆశాలతల ఆలంబం యింకా చావ లేదు. ఆగాలి మేడలకు పునాదులు లేవని అతనికింకా తెలియలేదు ... ఆకాశసౌధాలను పేకమేడలుగా కూలగొట్టే తుఫానురావొచ్చునని యింకా అతనికి తెలీదు. ఏ అచ్చరయో! ... ఏ అపరూప సౌందర్య వతియో ! ... నలకూబరసతియో ! ... అంతులేని ఐశ్వర్యంతో నాట్యంచేస్తూవచ్చి తన్ను చేసు కుంటుందని అతని వుద్దేశ్యం. అతను ఆమెను ప్రేమించాడు ... ఆవిషయాన్ని గుర్తెరుగకుండా గాలిమేడలు అడ్డంగా నిలజడిఉన్నాయి. అయితే ప్రేమ పరిస్థితులపైన ఆధారపడి ఉంటుందా ! ... అతను అనుకుంటాడు ఆమెను ప్రేమించాననీ .. ఆమెను పెండ్లి చేసుకోలేననీ ... తను ఆమెను పెండ్లి చేసుకోలేనందుకు కుంటికారణాలు అంతరాత్మకు చూపుదామనుకుని తన్ను తాను మోసపుచ్చుకుంటు న్నాడు .. ప్రేమని గుర్తెరుగలేక నాశనమౌతాడా!

## కాలేజిగరల్

ఆమె శక్తి వంచనలేకుండా రోజూ పౌడరు మొదలయినవి రాసుకుంటూ, వున్నవాట్లో శుభ్ర మయిన చీరకట్టుకొని వెళ్తూవుండేది కాలేజికి. ఆమె కాలేజికి వెళ్లేందుక్కు లాడ్జి ముందునుండి వెళ్లాలి. కనుక ఆమెఅల్లాగేవెళ్తూండేది. వరండాలో అంతానుంచుని కుక్కకూతలు, నక్కకూతలూ కూస్తూం డేవారు. రోజూ అల్లాగే జరుగుతూండేది. ఆమె తల వంచుకు వెళ్లిపోతూండేది. "కుక్కలెన్ని మొరిగినా ఏనుగు పరపతి పోతుందా అనుకొంటూ...

ఆమె లాడ్జిముందు దారిలో కాలు పెట్టింది. వారు అంతావచ్చి వరండామీదనుంచుని కార్య క్రమం ఆరంభించబోతున్నారు. ఆమెగుండె దడ దడా కొట్టుకుంటోంది. రోజూ యిదేగొడవ అయితే ఎంత నన్ను కాదనుకొన్నా భరించేదెలా ? ఇంకొక అడుగు... మరొక అడుగు లెక్క పెట్టుకుంటూ వెళ్తోంది...

"ఆహా! మందగజేంద్ర గామిరా" అన్నది ఓ గొంతు.

"ఆహా! ఏం ఒయ్యారంరా "అంది యింకోగొంతు. కొంచెం ధైర్యంచేసి చూద్దామని తలెత్తబోయింది.

"ఆ బాగానేవుంది కోట"

ఏం ఆమె ఎల్లావుంటే వాళ్లకేంబాధ? వాళ్లు మాత్రం రాసుకోటంలా పౌడరు సెంటులను...

"అరే చాలాసీరియస్ ... యిప్పుడు చూసిందంటే మాడిపోతావు...ప్రక్కకు తప్పుకో"

ఏంచేస్తుంది ? చూస్తేతప్పు...చూడకపోతే తప్పు తలయెత్తినడిస్తే "మొగరాజురా" అంటారు. తల దించుకుంటే ... "రా" అంటారు. ఇంకా గొడవ పడలేక ఓఅడుగు వేసింది. త్వరగాపోదామని.

"ఇంక ఎక్స్‌ప్రెస్ రోయ్ యిప్పుడిక్కడుందా ...మరుక్షణంలో...కాలేజీలో "

ఏంచేస్తుంది! ఆగోలనెలాగ అరికట్టడం. వాళ్ల ఉద్యేశము ఏమిటంటే ఆడవాళ్లను ఏడిపిస్తున్నా మని. ఏడిపించడం అనేదాన్కి అదే నిర్వచనం అవుతే వాళ్లుమాత్రం అల్లాచెయ్యలేరూ వాళ్లు పదిమంది వున్నప్పుడు ?

ఆమెకు కోపం మితిమీరిపోయింది. తలెత్తిఅటు చూసింది కొంచెం విసురుగా. వాళ్లంతా క్షణంలో మాయమయిపోయారు. ఆమెకుమాత్రం ఓమాట వినబడింది "నన్ను చూసిందేమోరోయ్. ప్రిన్సి పల్‌తో చెప్తుంది."

పిరికివాళ్లుపాపం...ఆమెదారిన ఆమె కాలేజికి వెళ్లిపోయింది.

## సౌధాలు

అతను మూడురోజుల్లో పెళ్లిచూపులకు వెళ్ల బోతున్నాడు; అంటే అతనువెళ్లి పని(క్షవరం) చేయించుకోవలసినషాపుFirst class Barber's shop అయివుండాలన్నమాట, కలలుకంటూ వెళ్తున్నాడు.

ఏదో ఆలోచిస్తున్న కళ్ళతో బార్బరుషాపుకు... అటువంటి ఆలోచనలకు కలలకు ఎప్పుడూ సాధో పరిభాగాలేకాని పునాదులు కనిపించవు. అల్లా పునాదులేకుండా ఆషాఢాలున్నందువల్ల ప్రజలకేం నష్టంలేదు. అతనికిమాత్రంవుంటే ఉండొచ్చుకాని (ఉండదనే నానమ్మకం.) అతన్ని పెళ్ళాడబోయే ఆవిడ అతనిక్రాపును, మీసాన్నిచూచి మొదటి చూపులోనే Love చేసిపడెయ్యాలి. వెళ్ళాడు సరిగ్గా బార్బరుషాపు ప్రాంగణంలోకి ... మెట్లు ఎక్కే సందర్భంలో అతనిమత్తు కొంతతగ్గింది... కొంతమాత్రమే ... తగ్గుత .. ఒకకత్తెరపడేప్పటికి మెలకువవచ్చింది. "అంటెయ్యకు" అన్నాడు. "మొదలెట్టాశానండి అలవాటుచొప్పున; యింక కుదరదు" అన్నాడు. .. మరెల్లాగ అతనికి ఆరకం క్రాపంటే పరమఅసహ్యం ... దానికీ అతనితలకీ అసలు కుదరదని నమ్మకం.. ఎందుకో? ఎల్లాగయినా తప్పదుగా .. అంతా యిల్లాగే చేయించుకుంటున్నారు; యిదీ ఓఫాషనే అని సరిపెట్టుకున్నాడు ... అది అక్కడికివదలి మళ్ళా పడ్డాడు మైకంలో ... ఆమె అతని క్రాపుచూసి ఎల్లా Imagine చేస్తుంది? ఒక నాగరీకుడులా ... అంతేనా? ... ఒక నవనాగరీకుణ్ణి ఒంచెయ్యడానికి ఏఆడది ఒప్పుకోదు? బహుశాఆమె బాబ్డు హైర్‌తో వుంటుందేమో! ఏమో. ... అయితే మాత్రం తనక్రాఫ్ తప్పకుండా ఎప్రిషియేట్ చేస్తుంది. చేసితీరాలి... దానికి రెండోదారిలేదు. నవనాగరీకురాలు కనుక ... First sight లో తప్పకుండా Impress అవుతుంది.. ఆలోచనలు సాగుతున్నాయి జీళ్ళపాకంలా ... అదేనా ఎక్కడో ఒకచోట సన్నమయి మానేస్తుంది. మనవాడికటువంటి పొరపాటు పనేంజరగదు ...

"బాబూ ఫ్రెంచికటింగు చేయనా. అన్నాడు 'ఊ' అని పరధ్యానంగా ... ప్లగ్ నొక్కింతర్వాత బల్బువెల్గడం మానుతుందా? ... ఓ నిముసంలో అతని మూనూగుమీసం అటు యిటు నిర్దాక్షిణ్యంగా కత్తిరించబడింది. ...

అతను చూచుకున్నాడు అద్దంలో ఎందుకో ఉలిక్కిపడి ... అతనికి సర్వాసహ్యం అటువంటి దంటే ... తనమీసాన్ని కత్తిరిస్తే యౌవనపు తొలిచిహ్నాన్ని, యౌవనాన్ని కత్తిరిస్తున్నట్లు బాధపడే స్వభావం, ఏమంటాడు! తనేకా 'ఊ' అన్నది. ఊహు తనుకాదు; తనలో ఏదో మత్తు ఊ అంది. సరే ఏదంటేం మొత్తానికి యిప్పుడు తెలుసుండే అవన్నీ అతికమని కయ్యం... దెబ్బలాట పెట్టలేడుకద. ఇంకో Different model లోకి మార్చమని అడుగుదామనుకొన్నాడు. ... తీరా తనుమార్చమని అడుగుతే ఎదురుగానున్న ఫ్రెంచికట్టింగు ఆసామీ Insult గా తీసుకొని దెబ్బలాడతాడేమోనని భయం వేసిందికూడా చెప్పొద్దూ మరి ... తిరిగి ఇంటికివస్తున్నాడు...ప్రజలందరికీ అంటవేసినక్రాపు, ఫ్రెంచికట్టింగుమీసం ఇష్టం...అదేనవనాగరీకుని లక్షణంగా గుర్తిస్తారు. మరి తనకు అవి కుదరవు. ... అతనిలో వ్యతిరిక్త ఆలోచనలురెండు. రెండూ బ్రహ్మాస్త్రాల్లా కొట్టుకుంటున్నాయి ... అది అంతరాత్మకీ బాహ్యాత్మకీ సంకుల సమరమంటే కాదని ఎవరనగలరు? అన్నా అతను ఒప్పుకోదల్చుకోలేదు. ఒకటి ఆలోచించండి; న్యాయంగా అంతరాత్మ నెగ్గాలికదూ? అంతే నెగ్గింది. ఇంటికెళ్ళి అద్దంతీశాడు .. రేజరు తీశాడు... బ్లేడు చేతిమీద అటూయిటూ నూరాడు. కత్తిపట్టిన వీరుడులా పోజుపెట్టి మొదలుపెట్టబోతున్నాడు మీసంమీద సాము; క్రాపు నేమీ చేయలేడు కనుక ... మీసాన్ని యిల్లాగ చేద్దామని ఊహ. Curve సరిగ్గా తిరగలేదు... తిరిగితే Symmetrical గా లేదు ... కోపము చెలియలికట్ట దాటిపోయింది. Impatienceకు హద్దులుమీరిపోయింది. రేజరు పూర్తిగా గీసేసింది మీసాన్ని ... పెళ్ళిచూపులు Postpone చేద్దామని అతని Proposal ... పెద్దల Disposal అయితే మొత్తానికి చిక్కే.

(సశేషము)

# తుమ్మెద — పువ్వు

శ్రీ బాలకృష్ణగారు

(గతసంచిక తరువాయి)

## తాగుబోతు

అతను ఆమెనే చేసుకోవాలని అనుకుంటూండే వాడు... ఇద్దరూ అనుకుంటూండేవారు. ఒకరికి ఒకరి అభిప్రాయం తెలిస్తేనేగా అది కుదరటం. కుదిరింది. ఇద్దరూ కలుసుకునేవారు నిర్జన ప్రదేశాల్లో... రోజూ $6\frac{1}{2}$కు కుంకేసూర్యుడు $5\frac{1}{2}$కే అస్తమించడం ప్రారంభించాడు... రోజులన్నీ ఒకలాగే నడవవుగా. అతను యింకొకతెను చేసుకోవలసి వచ్చింది పరిస్థితుల ఒత్తిడివల్ల ... ఆమె యింకొకని వివాహమాడింది... అది స్త్రీకి తప్పని విషయంకనుక... రోజులు... సంవత్సరాలు గిరగిరా తిరిగాయి... వాటి ధర్మం నిర్వర్తిస్తూ... ఆమెభర్త ఓపమునేనేళ్ల పిల్లవానిని వదలిపోయాడు 33 ఏటే 100 ఏళ్లూనిండి... అతనికూతురు చిన్నమాటలు తప్పటడుగులు దాటి... యౌవనజీవిత ప్రాంగణంలో అడుగుపెట్టింది... ఆమె విధవగా ... పూర్వస్నేహాన్ని పురస్కరించుకొని అతని ఊరికి వచ్చింది... అతని భార్యపోయి అప్పటికి ఆరుమాసాలయింది... ఇరువురిలో మునుపటి తలపులు మొలకలెత్తినై ...తల్లి, తండ్రుల బాధ్యతలు మీదుండటంవల్ల మొలకల్ని తుంపేశారు ... ఆమెకొడుకు అతని కూతురు కాలేజి చదువుకు వెళ్లారు వారిద్దరు ఒకఊరినుంచే వెళ్లడంవల్ల కొంచెం పరిచయం వయసులో వుండే స్త్రీ పురుషులకు పరిచయం ప్రేమకు, ప్రేమ పెళ్లికి దారితీస్తాయి స్వతహాగా... ఆమె జబ్బుచేసి ప్రాణాలు వదిలింది... ఆమెకొడుకును కాలేజికి ప్రోత్సహించి పంపింది అతనే... కొన్నాళ్లకు అతనిని అడిగారు యిద్దరూ పెళ్లి చేసుకుంటామని... ఇద్దరకూ గార్డియన్ అతనేగా.. ఏంచేస్తాడు! వద్దంటే ... యిద్దరూ బాధతో కుములిపోతారు... ప్రేమిస్తున్నామని పెళ్లికోసం అడిగినవాళ్లు ఏంచేసి వుంటారు...తన స్వంత అనుభవంతో కొలచి చూసాడు. జరిగేది ఎల్లాగాజరిగింది.. ఏంచెయ్యాలి వారిద్దరూ అన్నాచెల్లెళ్లని ఏవిధంగా తెలియజెయ్యాలి ... తెలియజేస్తే ఫలితం! వారిరువురూ పశ్చాత్తాపదుఃఖంతో కుమిలిపోడం, కుమిలి నశించిపోడం...తనకు సుఖం లేకపోడం...ఏదో నిశ్చయించాడు... నిశ్చయాన్ని తెలియబర్చాడు రిజిష్టరు మేరేజి చేసుకోమని. అతనిలో ఏదోఅగ్నిజ్వాలలు అలముకొనడం ప్రారంభించినై ... ఎదో పాపభీతి వెంటాడుతోంది... తానుచేసినది తననే దహించడం ప్రారంభించింది. ఆరహస్యం లోకానికి సంఘానికి తెలియని రహస్యం ... దాగేందుకు అతనిహృదిలో చోటులేదు. సంఘదృష్టిలో వారిద్దరూ భార్యాభర్తలే... వారికి సంఘంలో గౌరవం వుంటుంది... అతన్ని ఏదోఅజ్ఞాతశక్తి "చెప్పు ఆవిషయాన్ని చెప్పు" అని తరిమింది. ఏదో "ఫలితాన్ని ఆలోచించు" అంటోంది... విసురుగా వెళ్లేడు వాళ్లిద్దరూ వున్నచోటికి ... లోనికి చూచాడు... వారిరువురూ ఏదో అమర ఆనందంలో వూగుతున్నారు. మురిసిపోతున్నారు తమకలలు నిజమైనాయని ... అతను వారిద్దరూ తన బిడ్డలనిచెప్తే... ఆచూట పెద్దభూతమై వారిద్దరి పీకల్నిబట్టి పిసుకుతోంది ... లోకదృష్టిలో ఆమె పతివ్రతఅని వ్రాసియున్న గిల్టు అక్షరాలను చెరపి ఆభూతం కులటగా వ్రాస్తోంది... ఆభూతం వెనక్కు తిరిగింది. చేతులు చాపింది ఏదో కండలేని, రూపంలేని హస్తం అతని పీకను పట్టడంకోసం దూసుకు వచ్చింది ... అతనికాళ్లు పరుగు తీశాయి వేగంగా ... ఎక్కడకో-సారాదుకాణంవద్ద కడుపునిండా త్రాగాడు. సారా ఏదో తెలియని మత్తు ఆవరించింది... అతన్ని ... లోకదృష్టిలో అతనుయిప్పుడు త్రాగుబోతు మాత్రమే! ...

## ప్రణయము

ఆమె అతనిగొంతులో అమరత్వాన్ని అతనిమాటల తియ్యదనంలో అమృతాన్ని చూస్తూ అల్లాగేవుండిపోతుంది గంటలూ, రోజులూ. ఆమె అపరూప సౌందర్యంలో ఏదో ఊహాతీతమూ అమరానందాన్ననుభవిస్తూ స్వర్గధామంలో తేలిపోతూంటాడు ఆమె సాన్నిధ్యంలో. వారిమధ్య యుగాలు, క్షణాలుగా దొర్లిపోతూంటాయి. వారిమధ్య ప్రేమ దాని సాధారణ భావంలోకాక ఏదో లోలోతునుండి

వచ్చే అపూర్వ అర్థంతో విరాజిల్లుతూంటుంది. యుగయుగాలనుండీ స్త్రీ పురుషుల దోహదంతో ఏపుగా ఎదిగే ప్రేమలత వీరివద్దకువచ్చి ఏదో భావాతీతమా అర్థంతో యిరువురినీ కట్టివేసింది. వారిరువురి మధ్యా మోహానికి చోటులేదు. ఇరువురూ ఒకరి నొకరు విడిచి వుండలేరు. ఈ విషయం యిరువురికీ తెలుసు. విడిపోవలసివచ్చే క్షణంగురించి యిద్దరూ ఆలోచించేందుకు భయంతో వణుకుతారు. అయినా ఎందుకో ఆ క్షణాన్ని దూరంచేద్దామని వుద్దేశ్యం మొలకెత్తింది అతనిలో ... తనచేతిలో అదివున్నట్టుగానే. అలా యిరువురూ వుండడం సంఘం హర్షించదు. నీతిసూత్రాలు వారిప్రక్కనే గూడుఅల్లి వారిని వెలిపెట్టాయి. అతను అనుకున్నాడు ఆమెను భార్య చేసుకోడంతో సమస్యా పరిష్కారం అవుతుందని. సంఘానికి ఎదురొమ్ము విరచి నిలబడి (సంఘదృష్టిలో) కులటాపుత్త్రికను చేసుకోడంతో సమస్యా పరిష్కారం అవుతుం దనుకున్నాడు. సంఘంలో కుళ్లు వున్నపుడు నాకెందుకని ఓమూల తనంతాను పెళ్లి చేసుకోనివుంటే ఆకుళ్లువాసన తనకి రాదనుకున్నాడు .... అడిగాడు ఆమెను ఆవిషయం.. ఆమె చెప్పింది సంఘానికి భయపడి పెళ్లి చేసుకోవడం అనవసరమని, సంఘం తనప్రభావాన్ని యీవిధంగానే ప్రసరింపజేస్తుందని. సంఘం అంటే ఏదోభూతం ఎదురుగావచ్చి ఆపని చెయ్యమని శాసించిందనీ. ఏదో అజ్ఞాతహస్తం (సంఘం) అతన్ని పెళ్లివిషయం ఆలోచింపచేసిందే ప్రతిపనినీ చేయిస్తుందనీ. పెళ్లి చేసుకోని మూలకూచుని సంఘాన్ని ధిక్కరించి గెలిచాననీ ధీమాతో వుండడం నిజంగా గెలవడంకాదనీ, గౌరవంగా (సంఘదృష్టిలో) యిష్టం కాకపోయినా తల్లిదండ్రులు చెప్పిన ఆమెనే చేసుకొని పడివుండడంకన్న నికృష్టమనీ, సంఘసంస్కరణ, పెళ్లిచేసుకొనిసంఘాన్ని వదలి దూరంగాపోయి చుట్టూ గూడుకట్టుకుని కూచుంటే గాదని, సంఘంలోనే వుండి (అందులో ఎదురుగా నిలబడి) ఆబలీయమైన శక్తిముందు నిలబడి సంఘధర్మాలను వుత్తమస్థాయికి తీసుకువెళ్లాలని, సంఘంచెడ్డదికాదు - యిప్పుడున్న సంఘదృక్పథం చెడ్డదనీ, బూజుపట్టిన దాని దృక్పథాలను మార్చి నూతన మెరుగులతో వెలుగు దారులలో నడిపించాలనీ దేశకాలాలనుబట్టి సంఘ దృక్పథం మారాలనీ...ఏదో...ఏదో యింకా యింకా...అతను చూచాడు ఆమెవైపు బ్రహ్మ రహస్యం తెలిసిన వేదాంతిలా...ఇద్దరు విడువలేని ప్రాణస్నేహితుల్లా జీవితం నడుపవచ్చు అంది ఆమె ఏదో తీరని సందేహానికి సమాధానం దొరికింది. ఆమె చెప్పిందానికి తలవూపాడు......

అవును గడపవచ్చు ప్రాణస్నేహితుల్లా వేరు వేరుగా వారిజీవితాల్లో మరొకరు ప్రవేశించకుండా వున్నంతకాలం-తరువాత క్షణాలు యుగాలుగా ...

## అపశ్రుతి

అతను, ఆమె మొన్న సినిమాకు వెళ్దామంటే బయల్దేరలేదుకనక ఆమె అతను యీవాళ వెళ్దామంటే రాదు. పురుషుడు కొంచెంఎదిగిన మొక్క అనుకుంటే అతని జీవితానికి సుదూర సీమలలో వివిధ పరిస్థితులలో ఎదిగిన ఒకస్త్రీ జీవితాన్ని తీసుకువచ్చి ముడిపెట్టారు - తప్పదుకనుక. ఇద్దరి మానసిక భావాలు, ఆశయాలు కలిశాయా జీవితాన్ని సులభంగా యీడుకుంటూ పోతారు. సాధారణంగా కలియవనేచెప్పాలి. కలియకపోయినా ... వందకు తొంభై సంసారాల్లో Co-operation వుంటుంది. ఇద్దరూ ఒరగేసుకుపోయే వాళ్లు కాకపోయి యిరువురూ తెగేదాకా ఏవిషయాన్నైనా తెంపాలనిచూస్తే ... యికవారు చూచేవి న్యాయస్థానాలు ... సంసారంవీధినపడుతుంది. జీవితాన్నంతా ఒకరిపై ఒకరు ఆధారపడవలసినవాళ్లలో అహంభావాలు కనీసం వారిద్దరి మధ్యనైనా చావకపోతే ఫలితం...అపశ్రుతి, ఆమె ఆలోచించేది- మొన్నెందుకు అతను రాననాలి అనేకాని ఎందుకు వద్దన్నాడు అనికాదు. ఆమెలోని అహంభావం inferiority complex ఆమె నంతచేశాయి...అతను ఎంత ఒరగేసుకు పోయేవాడయినా ఎంతకాదన్నా సంపాదించేవాణ్ణి పోషించేవాణ్ణి అనే అహంభావం అతన్ని పీక్కుతింటోంది. అతను ఆఫీసులోకలిగిన చిరాకుని అంతరాత్మ లేవదీసిన ఏదో విప్లవాన్ని సినిమా

చూసే మోహంలో మర్చిపోదామనుకున్నాడు. కాని యింటికి వచ్చేటప్పటికి చుక్కెదురు, ఆమె అంది నాకు సర్దాగా వున్నపుడు మీరు రానపుడు నేను యీవాళ ఎందుకు 'రావాలిఅని... ఆమె అడిగిన దానిలో Logic వుంది. సరియైన సమాధానం చెప్ప లేనప్పుడు పుట్టేది వుడుకుబోతుతనం.. దానినుంచి వుద్భవించేది కోపం... అతనికి కోపం .. మనుజుల్ని రాక్షసులలోకి రవాణాచేసేందుకు అదొకదారి) వచ్చింది . ఏదోచిరాకు కోపంగా మారుతోంది "సరే ... వడ్డించు" అన్నాడు .. వడ్డన అయింది. అతని దృష్టికి ఆమెనడతలో, ప్రతిఅడుగులోనూ అహంభావం, తలవిసురు, విరగబాటుతనం, ఏదో పగతీర్చుకున్నట్లు (విజయసూచకమా) గర్వం... కనపడుతున్నై ... "ఏం బాగులేదు కూర.. ఉప్పు ఎక్కువ" అతను విసుక్కున్నాడు. అతను తన్ను కంట్రోలు చేసుకుందుకు పడేఅవస్థని అసమర్థత కింద తీసుకుంది... అసమర్థతకింద కాకపోయినా అలుసుతనంకింద తీసుకుంది ... "ఇదేమన్నాకబుర్లా తూచి చెప్పటానికి... ఓ యి అటుపడుతుంది యిటూ పడుతుంది"... అతని నోట్లోనుంచి మాట రాలేదు... నోట్లోకి ముద్దా వెళ్లలేదు. విస్తరివదలి చివాలున లేచిపోయాడు. అతనిలో కోపం అంచుల వద్దనుంది... పంచె కట్టుకుని గుమ్మం దాటుతున్నాడు. ఆమె పొదికట్టున నుంచుని... "అయితే మీరు వెళ్తున్నారన్నమాట... నేను యిటు యింకో థియేటరుకెళ్లవచ్చుగా... అతనిలోని ఓర్పును మించిపోయింది కోపం... కోపము సహనపు సరిహద్దుల్ని దాటింది 'ఉ'హూంకారం అది కనుబొమలముడితో ఎర్రబడిన మొగంతో చూచాడు. ఎదురుగా ఏదో గర్వంతో చూచేచూపు. అతనిలోని రాక్షసత్వం నాగరికత వెనకదాగున్నది... దూసుకు వచ్చింది .. చెయ్యి... పైకిలేచింది... రాక్షస సహజమైన పని చేయడానికి ... అతడు యుక్తాయుక్త జ్ఞానం తెలియని ఒకపశువుగా ప్రవర్తించ బోతున్నాడు... ఎదురుగా... బిక్క మొగం బెదురుకళ్లు... అతనిలోని నాగరికత నువ్వేయిల్లా చేస్తే... అంది... ఏం అధికారం వుంది? అంది.. ఏదో.. అంతరాత్మ ఛెల్లున కొట్టింది లేకచాపలా... భరించలేని బాధతో శయ్యాశ్రయించాడు... తనుచేసిన పనికి మళ్లీ ఆమెముఖం చూడలేక సిగ్గుతో కుంచుకుపోయాడు...

చెక్కిలిమీద చెయ్యివేస్తూ. "ఏమండీ! కోపమా? తమాషాకి అన్నాను... లేవండీ సినిమాకి వెళ్దాం!..."

కథ

అసలు ఆయన కథలు వ్రాయటంవల్ల ప్రజల కేమన్నా ఉపకారం వుందా అని తల్లక్రిందులుగా ఆలోచిస్తూండేవాడు బుర్ర చెడగొట్టుకుంటూ. ఆయన అనుకుంటూండేవాడు pen లో ink చెల్లక తను వ్రాస్తున్నట్టూ, జేబులోడబ్బులు బొత్తిగా చెల్లకవాళ్లు కొనుక్కొని చదువుతున్నట్టూ. ఆయన యీనాడు కనిపెట్టినవిషయం ఏమిటంటే తనురాసిన కథలు కొంచెం ప్రజల కుపయోగపడ్డాయి అర్థం చేసుకుంటే అని ..

ఆయన కూతురికి అసలు విషయమేం అర్థం కాలేదు .. మొన్నటివరకూ చిన్న పరికిణీకట్టుకుని చెంగుచెంగున గెంతుతూ ఆటలాడుకునే తన్ను యిల్లో ఎందుకు బంధించేస్తున్నారూ అనేది. మొన్నటి వరకూ పక్కింటి అబ్బాయితో ఆడుకొనేది దొంగాట. అదీ... ఇప్పుడు హఠాత్తుగా వచ్చిన ప్రమాదమేదో తెలీలేదు... ఆమె ఘోర్తుఘారం చదువుతోంది. రెండు నెల్లు ఘోర్తుఘారం చదవటం అయింది... మిన్నువిరిగి మీదపడ్డట్టు... "ఇంకనువ్వు స్కూలుకెళ్లకూడదమ్మా" అనేసి ఊరుకున్నారు. పైటైతే వేసుకోడం బాగానే వుంది కాని ఈ అడుగడుగుకు ఆంక్షలు మాత్రం ఏం బాగులేవు... తన చిన్నబుర్రతో ఆలోచించి చూసింది, అసలు విషయమేమై వుంటుందా అని... ఎంత ఆలోచించినా అర్థంకాక ఓరోజున తల్లినడిగి వూరుకుంది... ఆమె, ఎల్లా చెప్పాలో ఏంచెప్పాలో అర్థంకాక బుర్ర గోక్కుని అటుచూసి యిటుచూసి... "నువ్వు వయస్సు వచ్చిన పిల్లవు వెళ్లకూడదు" అంది... 'ఏం' అని అడిగేప్పటికి అల్లా అడక్కూడదని నోరునొక్కి కసురుకుంది. ఆమెకది తీరనిసందేహంగానే వుండిపోయింది.

అసలా తడవా ఆవిషయాన్ని అడుగుతూనే వుంది తల్లిని అర్థంకాక... ఆయనకా విషయం తెల్సింది... ఆయన కథలోని కథానాయిక చాల తెలివైంది నవనాగరీక యువతి... యువతివున్న తర్వాత కథలో యిక ఎవరో ఒకరు ప్రేమించాలి ఆమెను. మన కథ అల్లాలేదు... ఒక నవనాగరీకుడు ఆమెను వెంటాడుతూంటాడు. ఏదో ఒక దుర్బలక్షణంలో పడగొట్టి ఆమెను అనుభవించేందుకు... ఇద్దరూ కాలేజిస్టూడెంట్లులెండి ... యిక సినిమాలూ ... డ్రామాలూ ...ఏకాంత విహారాలూ ... what not అన్నీని... ఒకటి తప్పిపోగూడదు... ఆమె అతన్ని ప్రేమించలేదు... అతను ఆమెను ప్రేమించలేదు... ఇద్దరూ friendsమాత్రమే ! ... ఇంకకథ ఎల్లాఅంతమాతే మనకెందుకు లెండి... అక్కడే ఆయన మణిపూసల్లాంటి వాక్యాలు దొర్లించాడు. "అందరకు వయసురాగానే యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం రాదు. వారు చేసిన పని తెల్సిచేసినారు; తెలియక చేసినా ఫలితం అనుభవించక తప్పదు. చంటిపిల్లవాడు నిప్పులో చెయ్యి తెలిసిపెట్టినా తెలియక పెట్టినా కాలి తీరుతుంది. ఆయా పరిస్థితులు వచ్చినపుడు ఎంతటి ఋషులైనా స్త్రీవాంఛకు లోనౌతారు. ఎంతటి స్త్రీయైనా పురుషునికి ఏదుర్బలక్షణంలోనో లొంగి తీరుతుంది. ఆక్షణం దాటినతర్వాత లాభంలేదు. (దీనికి అతీతులైన పురుషులూ వుండవచ్చు స్త్రీలూ వుండవచ్చు... అంతా అటువంటివాళ్లు కారుగా) ఒకసారి జారిన స్త్రీకి మరల సంఘంలో స్థానంలేదు. అందుకే, తల్లిదండ్రులు వయస్సువచ్చిన పిల్లల్ని (మొగపురుషుడవనీ స్త్రీఅవనీ) జాగ్రత్తగా చూచుకోవాలంటారు ... అదంతా ఆదుర్బలక్షణాన్ని దూరంచేసే యత్నమే ! యింకా... యింకా అతను పత్రికకు పంపుదామని కవరులో పెట్టిన కాగితాలు చిందరవందరగా వున్నాయి. ఆమె తల్లిని ఆవిషయం గురించి అడగడం మానివేసింది... అతను కనిపెట్టాడు తనకథవల్ల ప్రజల కుపయోగముందని...



★

కంకణ గృహీత రుక్మిణమ్మ, భర్త సత్యనారాయణశాస్త్రి, అధ్యక్షురాలు పద్మాసనమ్మ గార్లు.

★